నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 26, 2024 | www.navatelangana.com

తాగునీటి బావి పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని పిప్పల్‌దరి గ్రామంలో బుధవారం ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తాగు నీటి బావిని పరిశీలించారు. ఎండాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జిల్లాకు వచ్చిన పార్లమెంట్ పోలీసు అబ్జర్వర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ రాజేష్ కుమార్ గురువారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఆయనను పట్టణంలోని పెన్‌గంగ గెస్ట్ హౌస్‌లో జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకుంటున్న చర్యలపై వారు చర్చించారు.



ముగిసిన నామినేషన్ల ఘట్టం..!

- వారం రోజుల్లో 23మంది..42 సెట్లు దాఖలు
- చివరి రోజు హడావుడి ఏకంగా 18మంది దాఖలు
- నేడు పరిశీలన..29 వరకు ఉపసంహరణ
- అదే రోజున అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు
- ఆ తర్వాత మరింత ఉపందుకోనున్న ప్రచారం

ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో నిలిచేందుకు ప్రధాన క్రతువుగా భావించే నామినేషన్ల ఘట్టం పూర్తయింది. వారం రోజుల పాటు సాగిన ఈ పర్వంలో లోక్‌సభ పరిధిలో 23మంది అభ్యర్థులు 42 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కో అభ్యర్థి 4సెట్లు వేసేందుకు అవకాశం ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నాలుగేసి సెట్లు వేయగా.. మిగితా వివిధ పార్టీలకు చెందిన వారు, స్వతంత్రులు 2 నుంచి 3సెట్ల వరకు దాఖలు చేసినట్లు తెలిసింది. ఈ నెల 18న ప్రారంభమైన ఈ నామినేషన్ల క్రతువు 25వ తేదీ వరకు సాగింది. తొలి నుంచి నెమ్మదిగా ప్రారంభమైన ఈ ఘట్టం చివరి రోజున గురువారం హడావుడి కనిపించింది. ఉదయం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వివిధ గుర్తింపు కలిగిన పార్టీల తరపున, పలువురు స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేసేందుకు పోటీపడ్డారు. అభ్యర్థుల నుంచి లోక్‌సభ రిటర్నింగ్ అధికారి రాజర్షిషా నామపత్రాలు స్వీకరించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో నిలిచేందుకు అభ్యర్థులు పోటీపడ్డారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉత్సాహం కనబర్చారు. ఒకే స్థానం కోసం భారీగా నామినేషన్లు దాఖలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ, డీఎస్పీతో పాటు గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మరికొందరు స్వతంత్రంగా బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికలకు ప్రధాన ఘట్టంగా భావించే నామినేషన్ల క్రతువు ఈ నెల 18న ప్రారంభం కాగా.. తొలి రెండు రోజులు ఒకటి, రెండు మినహా అంతగా దాఖలు కాలేదు. కానీ ఈ నెల 22 నుంచి 25వరకు రోజూ పదుల సంఖ్యలో నామపత్రాలు దాఖలు కావడం ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు వేయడంతో హడావుడి కనిపించింది. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ భారీ బహిరంగ సభ నిర్వహించి నామినేషన్ దాఖలు చేయగా.. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు మాత్రం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వీరితో పాటు పలువురు గుర్తింపు కలిగిన పార్టీలకు చెందిన వారు ముఖ్య నాయకులు, అనుచరులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే లోనికి అనుమతించడంతో అభ్యర్థులతో వచ్చిన ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వంద మీటర్ల దూరంలోనే ఉండిపోయారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.




నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి అందజేస్తున్న బీఎస్పీ అభ్యర్థి

నేడు పరిశీలన..29వరకు ఉపసంహరణ..!

ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో నిలిచేందుకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను ఎన్నికల అధికారులు శుక్రవారం పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్ పత్రాల్లో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని తిరస్కరించనున్నారు. నిబంధనల ప్రకారం సక్రమంగా ఉన్న నామినేషన్లను మాత్రం పరిగణనలోని తీసుకోనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. చివరగా ఎందరు ఎన్నికల బరిలో ఉంటారోననే విషయం 29వ రోజున ఖరారు కానుంది. అదే రోజున స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. దీంతో మరుసటి రోజు నుంచి ప్రచారం మరింత ముమ్మరంగా సాగనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారపర్వంలో తలమునకలై ఉండగా.. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం గుర్తులు కేటాయించిన తర్వాత ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. వీరికి మరో పది రోజుల పాటు ప్రచారాన్ని నిర్వహించుకునేందుకు అవకాశం లభించనుంది.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు వీరే

ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో నిలిచేందుకు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు 23మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఆత్రం సుగుణ(కాంగ్రెస్), ఆత్రం సక్కు(బీఆర్ఎస్), గోడం నగేష్(బీజేపీ), మేస్రం జంగు బాపు(బీఎస్పీ), మేస్రం గంగాదేవీ(డీఎస్పీ), చవాన్ సుదర్శన్(అన్న వైఎస్ఆర్ పార్టీ), కొడప వామన్‌రావు(గోండ్వాన దండకారణ్యపార్టీ), గేడం సాగర్(ఇండియా ప్రజాబంధు), మాలోత్ శ్యాంలాల్‌నాయక్(ఆధార్ పార్టీ), తిరుపతి(విద్యార్థుల రాజకీయ పార్టీ), మడావి వెంకట్రావ్(రాష్ట్రీయ మానవ-పార్టీ), రాథోడ్ రమేష్(బీజేపీ), ఆత్రం భాస్కర్(కాంగ్రెస్), దారావత్ నరేందర్(బీఆర్ఎస్), స్వతంత్రులుగా రాథోడ్ సుభాష్, చవాన్ రాము, నేతావత్ రాందాస్, కొమురం ముత్తయ్య, రాథోడ్ రాజు, భూక్యా జయవంత్‌రావు, పెందూర్ సుధాకర్, నైతం రవీందర్, ఆత్రం భీంరావు నామినేషన్ దాఖలు చేశారు.



కలెక్టరేట్ ఎదుట పోలీసుల బందోబస్తు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జైపూర్ : మండలంలోని టేకుమట్ల శివారులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దులపల్లి గ్రామానికి చెందిన సొల్లూరి అజయ్(22) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఇందారం నుండి టేకుమట్ల మీదుగా మద్దులపల్లికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెట్టును ఢీకొట్టడంతో అజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. అందిన సమాచారంతో ఎస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాంసి : ఇంటి పరిసరాలను దోమలు రాకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్య ప్రజలకు సూచించారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామ వీధుల్లో ప్రజలకు మలేరియా వ్యాధి వల్ల వచ్చే అనర్థాలు, నివారణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా దోమ కాటు వల్ల వచ్చే వ్యాధి అని, కొన్ని సమయాల్లో ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడు తినాలని తెలిపారు. మొక్కల కుండీలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా మురికి కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లయితే మలేరియా సోకకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తులసీరాం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పదేండ్ల బీజేపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఆదిలాబాద్‌టౌన్ : పదేండ్ల బీజేపీలో పాలనలో అభివృద్ధి జరగలేదని, కేవలం అక్షింతలు పంపిణీ చేశారని ప్రజలు అంటున్నారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం పట్టణంలోని వార్డు నంబర్ 27, 28, 29, 30, 31లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కోలీపుర, బొక్కలగూడ, ఖానాపూర్ తదితర కాలనీల్లో రోడ్ షో నిర్వహించి ప్రజలను కలుస్తు అభివాదం చేశారు. కాలనీకి వచ్చిన ఆమెకు ప్రజలు పులమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ పదేండ్ల బీజేపీ పాలనలో జిల్లాలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఆదిలాబాద్‌కు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. అభివృద్ధిని మరిచి ప్రజలకు అక్షింతలు ఇచ్చారని ప్రజలు ప్రచారంలో తమకు చెబుతున్నారన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారం చేపట్టబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, నాయకులు షకీల్, గంగాధర్, ముజ్జు, నగేష్ పాల్గొన్నారు.

అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

నస్పూర్: విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలు తీసుకొని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. గురువారం ఉజ్జల, విశ్వశాంతి హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే జీవితం మీద నిరాశ చెంది ఆత్మహత్యలు చేసుకోకూడదని తెలిపారు. రాబోవు 10వ తరగతి ఫలితాల దృష్ట్యా విద్యార్థులు ఎవరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని సూచించారు. ర్యాంకులు, మార్కులే ప్రామాణికం కాదని, జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యాప్తిపై అవగాహన



ఇంద్రవెల్లి : మలేరియా వ్యాప్తిపై స్థానిక వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గురువారం డా.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా పిహెచ్‌సి నుంచి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ వాడల్లోకి వెళ్లి ప్రజలకు మలేరియా వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీళ్లను ఇంటి ఆవరణలో ఉంచకుండా చూడాలని సూచించారు. దీని వల్ల దోమల వ్యాప్తి చెందుతాయని తెలిపారు. దోమలతో మలేరియా సోకుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సముద్ర, హెచ్ఎస్ శ్రీనివాస్, ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక సంఘం ఎన్నిక

మంచిర్యాల: మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం సంఘం గౌరవ అధ్యక్షుడు సుద్దమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోగర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బూడిద శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరు తిరుపతి, ఉపాధ్యక్షులుగా ఉప్పులేటి రామస్వామి, ఆవుల శ్రీనివాస్, పల్లపు రాజేశ్వరి, వాసాల కుమారస్వామి, అవునూరి లింగయ్య, చిప్పకుర్తి రాకేష్, బూడిద తిరుపతి, ఓరుగంటి దుర్గమ్మ, అవునూరి సుధాకర్ ఎన్నికయ్యారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రెండవ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎడిపెల్లి గణేష్ ఇంటి సమీపంలోని ఓ మహిళ ఇంటిలోకి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన కారణంగా మావల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. మహిళతో అసభ్యంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్‌పై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు రిపోర్ట్ పంపుతామని తెలిపారు.

రైతులు జొన్నలు ఆరబెట్టి తీసుకురావాలి

తాంసి : మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులోని జొన్నల కొనుగోలు కేంద్రానికి జొన్నలు తీసుకొచ్చే రైతులు ఆరబెట్టి తీసుకురావాలని సీఈవో కేశవ్ కోరారు. ప్రస్తుతం రైతులు పంటను ఆరబెట్టకుండా, వ్యర్థ పదార్థాలు తొలగించకుండా తీసుకురావడంతో తేమ శాతం సైతం అధికంగా వస్తోందన్నారు. తేమ 14 శాతం వచ్చే విధంగా జొన్నలను ఆరబెట్టి నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకు రావాలని తెలిపారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్, ఇంటర్(టాస్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి మొదలైన ఈ పరీక్షలకు తొలిరోజు విద్యార్థులు పరీక్ష రాయడానికి కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా

రాజకీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషించాలి

- జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు తమ వంతు పాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ వి.రాములు, ప్రత్యేక అదనపు కలెక్టర్ (ఎల్ఎ,ఆర్‌అండ్ఆర్) డి.చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజకవర్గాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, నీడ, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలతో పాటు వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సూక్ష్మ పరిశీలకులు, రక్షణ దళాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగుల కొరకు హోమ్ ఓటింగ్ అవకాశం కల్పించడం జరిగిందని, ఈ క్రమంలో 116 మంది వయోవృద్ధులు, 216 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా సహాయ రిటర్నింగ్ అధికారుల ద్వారా దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోమ్ ఓటింగ్ సంబంధిత వివరాలను రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి అధికారులకు సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన, ఇతర ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు కంట్రోల్ రూమ్, సి-విజిల్ ద్వారా స్వీకరించి 100 నిమిషాల లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 30న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ ర్యాండమైజేషన్, మే 12న 3వ ర్యాండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అత్యవసర విధులు నిర్వహిస్తున్న వారు, ఎన్నికల విధులలో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్, స్టాటిస్టికల్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన బృందాల ద్వారా 24 గంటలు పర్యవేక్షించడం జరుగుతుందని, ఎన్నికలను ప్రభావితం చేసే అంశాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటిస్తూ సహకరించాలని తెలిపారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి



నవతెలంగాణ-తాంసి

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని ఐటీడీఎ పిఓ కుష్బు గుప్తా ఓటర్లను విజ్ఞప్తి చేశారు. గురువారం భీంపూర్ మండలం జల్కొరి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి పోలింగ్ చీటీలు అందించాలని తెలిపారు. 25 నుండి 8 వరకు పోలింగ్ చీటీలు పంచడం పూర్తి చేయాలన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గోడపూర్ గ్రామంలో గతేడాది జరిగిన ఉపాధిహామీ పనులలో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డాడని మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్ ఫిర్యాదు మేరకు గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్, మాజీ సర్పంచులను విచారించి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని డీఆర్డీఓ తెలిపారు. అక్కడి నుంచి రంజిని గ్రామాలో చేపడుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ఉపాధి కూలి పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనికి తగ్గట్టుగా కూలి డబ్బులు కూలీలకు అందించేలా చూడాలన్నారు. ప్రతి కూలికి 100రోజులు పని కల్పించి డబ్బులు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట ఉపాధి హామీ ఏపీఓ హరిలాల్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక సుగుణక్కను గెలిపించాలి

బేల: మండలంలోని పీట్‌గావ్, తాండపట్‌గావ్, గోండుగూడలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని గడపగడపకు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు కేంద్రంలో ఉన్న బిజేపీ ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిని విస్మరించిందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోడెం నగేష్ ఆదివాసులకు, ఆదిలాబాద్ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ఆసిఫాబాద్ అసెంబ్లీ ప్రాంతంలో చెల్లని రూపాయి ఆదిలాబాద్ పార్లమెంట్‌లో ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదిలాబాద్ గళాన్ని పార్లమెంట్‌లో వినిపించే ఉద్యమకారి, ఆదివాసీ బిడ్డ ఆత్రం సుగుణక్క భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విలాస్ పాటిల్, బాపురావు, అనిల్ ధోటే, ప్రశాంత్‌రెడ్డి, విలాస్ జాదవ్, గణపతి రాథోడ్, దేవిదాస్ రాథోడ్, దినేష్ జాదవ్ పాల్గొన్నారు.



రేపు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కే.భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు ఇంతవరకు జరిగిన వివిధ అభివృద్ధి పనులపై పూర్తి సమాచారంతో రావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన వర్షిత

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని వర్షిత బుధవారం వెలువడిన ఫలితాల్లో సత్తా చాటింది. పట్టణంలోని బాలాజీ ఫొటో స్టూడియో నిర్వాహకుడు ఠాకూర్ విజయ్ సింగ్ కుమార్తె వర్షిత ఎంపీసీ విభాగంలో 470కి గాను 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం నిలిచింది. దీంతో గురువారం సామాజిక కార్యకర్త కేశవ్ విద్యార్థినికి శాలువా కప్పి సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఉత్తమ మార్కులు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని

నవతెలంగాణ-తలమడుగు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థిని బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటింది. మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన మొట్టె వేదస్వీ నారాయణ దంపతుల కుమార్తె మొట్టె శ్రీస్నిగ్ధ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను, 417 మార్కులు సాధించి, ఏ గ్రేడులో నిలించింది. దీంతో గ్రామస్తులు పలువురు విద్యార్థిని అభినందించారు.

ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలి



నవతెలంగాణ-తలమడుగు

ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉండం, నడింపల్లి, కడపల్లి గ్రామాల్లో గురువారం జెడ్పీటీపీ గోక గణేష్‌రెడ్డి ఇంటిట తిరుగుతూ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను చేతు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామాలలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ప్రచారం కొనసాగించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఇండ్లలోనే జీవితాలు కొనసాగిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏం చెబుతుందో అదే చేస్తుంది ఎన్నికలవేళ మీ ఇంటి ముందుకు అనేక పార్టీ నాయకులు ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ఇంటి ముందుకు వస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లనే చూపించాలని తెలిపారు. మోసపూరిత మాటలు మోసపోకుండా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని మండల ప్రజలను కోరారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు కూడా దొందెనని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో మండల కాంగ్రెస్ నాయకులు కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసి బొల్లారం బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మెన్ ప్రకాష్‌రావు, వెంకన్న, మైనారిటీ సెల్ అధ్యక్షులు రఫీక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, పోతన్న, రామచందర్ దేశ్ ముక్, లోక ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్ గాజుల, మోహన్, గంగన్న, రాకేష్, చెన్నాల సాయి కిరణ్, వంశీ, పోషెట్టీ, పోచన్న, గణేష్, సుభాష్, విలాస్ యాదవ్, నగేష్, చిన్ను, సంతోష్ గ్రామస్తులు ఉన్నారు.

సారంగాపూర్ : గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల ఎస్టీసెల్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు భీమ్‌రావ్, ఉపాధ్యక్షులు తేజు నాయక్ అన్నారు. గురవారం మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు సోనియా గాంధీ ప్రకటించిన, హామీల కరపత్రాలను అందజేసి చేతు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యంత మెజారీటితో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ నాయకులు, పోతారెడ్డి, రాథోడ్ సురేష్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులు అందజేయాలి



నవతెలంగాణ-తలమడుగు

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులు అందజేయాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. గురువారం పార్లమెంట్ ఎన్నికల్లో నేపథ్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బీఎల్ఓ, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ ఎన్నికలకు కొద్దిరోజులు మాత్రమే ఉండటంతో బీఎల్వోలు పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి రసీదులు అందించాలన్నారు. ఓటరు నమోదు లిస్టులో ఎవరి పేరు ఉంటే వారికి రసీదును తప్పకుండా అందించాలని బీఎల్ఓలను కోరారు. అదేవిధంగా ఎన్నికల రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన వారికి మర్యాదపూర్వకంగా బూత్ నెంబర్ వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఓటు వేసి ఎందుకు వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అదేవిధంగా వైద్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు బీఎల్వోలు మంచినీటి సౌకర్యంతో పాటు పోలింగ్ బూతులో సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి



నవతెలంగాణ-సిరికొండ

ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో ఓటరు స్లిప్పులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఓటరు స్లిప్పులను కచ్చితంగా సంబంధిత ఓటర్లకే ఇవ్వాలని, ఇతరులకు ఇవ్వరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విలాస్, సీనియర్ అసిస్టెంట్ ఉమారాణి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పూర్తిగా తొలగించేందుకు కృషి చేస్తా

- ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండల కేంద్రంలో టీజేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం గురువారం లింగోజి చెరువులో ఉపాధి హామీ కూలీలను కలిసి ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే చుట్టుపక్కల గ్రామాలకు ముప్పు పొంచి ఉందని తెలిపారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఫ్యాక్టరీ నిర్మించడం సరికాదని, ఫ్యాక్టరీ పూర్తిగా తొలగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రభావంపై రైతులు సంతకాల సేకరణతో వినతిపత్రం అందజేశారు. వీడీసీ సభ్యులు, నాయకులు ఆయనకు శాలువాతో సత్కరించారు. అనంతరం ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. పచ్చని పంట పొలాల్లో పారిశ్రమ ఏర్పాటు చేయడంతో మా పంటలు నాశనమవుతాయని, జీవకోటి ఆరోగ్యం దెబ్బతింటుందని, గోదావరి నది ఫ్యాక్టరీ ప్రదేశానికి చేరువలోనే ఉండటంతో ఫ్యాక్టరీ వ్యర్థ పదార్థాలతో గోదావరి నీరు కలిషిమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇథనాల్ ఫ్యాక్టరీ పూర్తిగా తొలగించేలా కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సాగర్ రెడ్డి, అరుగుల రమణ, కుంట గంగారెడ్డి, సప్పల రవి, కోడె శ్రీనివాస్, కోడె నవీన్, బెల్లాజి రాజు, కోడె విజయ్, బొల్ల దయాకర్, వీడీసీ సభ్యులు వసుల గంగారెడ్డి, దనె నర్సయ్య, మహిపాల్‌రెడ్డి, కట్కం రాజారెడ్డి, తెలంగాణ జేఏసీ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కును అధిక మెజారిటీతో గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆత్రం సక్కును అధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్ అన్నారు. గురువారం మావల మండలంలోని బట్టిసవర్గాంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించిన ఈ ప్రాంతం ఏలాంటి అభివృద్ధికి నోచుకోలేదని వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏవన్, చందాల రాజన్న, రాగం గోవర్ధన్, సుధీర్, అజీమ్‌ఖాన్, ఆసీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

నార్నూర్ : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్ అన్నారు. గురువారం మండలంలోని సుంగాపూర్‌తో పాటు తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున జోరుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి సాధ్యమని ప్రజలు గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఉర్వేత రూపదేవ్, తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, పార్టీ జనరల్ సెక్రటరీ సయ్యద్ కాశీం, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

దేశంలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం తుడుందెబ్బ, తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో కుమురంభీం కాలనిలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమే మనకు ఇందిరమ్మ ఇండ్లు, పోడుపట్టాలు, కరెంట్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం, విద్య వైద్యం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా, ఆదివాసీ ఆడబిడ్డగా చెయి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. పార్లమెంటులో మీ గొంతుకగా సమస్యలను, డిమాండ్లను పరిష్కరించే దిశగా మాట్లాడి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- డీఎంహెచ్ఓ డా.నరేందర్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మలేరియా రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హజరై అధికారులతో కలిసి మలేరియా అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదని తెలిపారు. ప్రభావం లేదని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మళ్లీ అది ప్రబలే ప్రమాదం ఉందన్నారు. నిత్యం ర్యాపిడ్ ఫివర్ సర్వే, డ్రై డే నిర్వహిస్తు ప్రజలకు దోమ నివారణపై అవగాహన కల్పించడంతో పాటు గిరి గ్రామాల్లో దోమ తెరలను పంపిణీ చేశామన్నారు. దాని కారణంగా సంవత్సర కాలంగా ఒక కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఇలానే మలేరియా రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ సాధన, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్, మెడికల్ అధికారులు, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నార్నూర్ : జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్యసిబ్బంది ఖంపూర్ గ్రామపంచాయతీలో మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణకు తీసుకునే జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రత దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకునే జాగ్రతలు దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను తెలిపారు. అవగాహన కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది హిమబిందు, గోకుల్, ఈశ్వరి, విద్య రాణి, కార్యదర్శి కాశీరాం, ఆశా విజయలక్ష్మి, రంభబాయి ఉన్నారు.

సిరికొండ : మలేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఉట్నూర్ బి.విజయకుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో, సిబ్బందితో మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దోమలు లేకుండా మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రతాప్ నాయక్, సిబ్బంది శైలెందర్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు ఎ.కపిల్, ఆర్.సంతోష్ కుమార్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు పావని, సాయిప్రియ, నికిత, రుచిత, సుష్మిత రూపొందించిన, 'ఆదిలాబాద్ జిల్లా కొలాంల-జీవన స్థితిగతులు' అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. రెండు దశల్లో నిర్వహించిన జిజ్ఞాస పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు ఈ బహుమతిని సాధించారు. ఈనెల 2న ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల నాంపల్లి హైదరాబాద్‌లో జరిగిన ప్రదర్శనలో న్యాయ నిర్ణేతల మన్ననలు పొంది వీరి ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. త్వరలో నిర్వహించే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో రూ.30 వేలు, ప్రశంసా పత్రాలను విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులను, అధ్యాపకులను పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 16 సబ్జెక్టుల్లో 1033 ప్రాజెక్టులు పోటీల్లో నిలిస్తే అందులో 290 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఉత్తమ ప్రదర్శనతో ఆదిలాబాద్ కళాశాల తెలుగు విభాగం రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి బహుమతి సాధించిన ఏకైక ప్రాజెక్టు కావడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో జిజ్ఞాస జిల్లా సమన్వయకర్త కే.రమేష్, పీడీ అనిత, డాక్టర్ నర్సింగరావు అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

వ్యాక్సిన్ అమలుపై క్షేత్రస్థాయిలో పర్యటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యాక్సిన్లపై క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికి పర్యటించడం జరిగిందని జాన్సన్ స్నో ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ టెక్నికల్ మేనేజర్ డెవిడ్ దామర అన్నారు. నాలుగు రోజులుగా జిల్లాలో పర్యటించి వ్యాక్సిన్ పని తీరును తెలుసుకొని వివరాలను డీఎంహెచ్ఓ డా.నరేందర్‌కు వివరించారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓను కలిసి వారి అనుభవాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఏడు వ్యాక్సిన్లను ప్రవేశ పెట్టిందన్నారు. ప్రస్తుతం డయేరియా, నిమోనియ నివారణకు వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. వాటి ప్రభావం ప్రజలపై ఎలా ఉందో తెలుసుకోవడానికి తాము జిల్లాలో పర్యటించామని తెలిపారు. గ్రామాల్లో వెళ్లినప్పుడు ప్రజల స్పందన బాగుందన్నారు. వ్యాక్సిన్ వల్ల ఎవరికి ఎలాంటి దుష్ప్రభవం లేదన్న విషయాన్ని తెలుసుకున్నామని అన్నారు. తమ నివేధికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్, జాన్సన్ స్నో రిజినల్ టెక్నికల్ మేనేజర్ డాక్టర్ జయంత మజుందర్, ఎం అండ్ కన్సల్ట్ శ్యామ్ కుమార్ ఉన్నారు.

ఎండ తీవ్రత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎండ కాలం నేపథ్యంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరుబయట పనిచేసేవారు సూర్యరశ్మి నుంచి కాపాడుకొనేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. తరచూ నీళ్ల తాగుతూ ఉండాలని, బయటకు వెళ్లేటపుడు వెంట మంచి నీళ తీసుకెళ్లాలని సూచించారు. వేసవిలో ఎక్కువగా నిమ్మ రసం, కొబ్బరి నీళ్ల వంటివి తాగుతూ ఉండాలని, తెలుపు రంగు, లేత వర్ణము కలిగిన పలుచని కాటన్ వస్త్రాలను ధరించాలని అన్నారు. తలకు వేడి తగలకుండా టోపీ పెట్టుకోవాలన్నారు. రుమాలు చుట్టుకోవాలని, పలుచని మజ్జిగా, గ్లూకోజ్ నీరు, చిటికెడు ఉప్పు చెంచా చెక్కెరను ఒక గ్లాసు నీటిలో కలుపుకొని ఇంటిలోనే తయారు చేయబడిన ఓఆర్ఎస్ ద్రావణం తాగినట్లైతే వడదెబ్బ నుంచి సత్వర ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. వడదెబ్బ తగిలిన వారిని నీడలో, చల్లని ప్రదేశాలలో ఉంచాలని, శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుందని పేర్కొన్నారు. సాధారణ ఉష్ణోగ్రత తగ్గేవరకూ తడిగుడ్డతో తుడుస్తూ ఉండాలని, చంటి పిల్లలు, గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు అనారోగ్యంతో ఉన్నవారు వాడగాల్పులకు గురికాకుండా కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎండ తీవ్రత ఉన్నప్పుడు చేయకూడని పనులు...

ఎండలో తిరగకూడదని బాగా ముదురుగా ఉండే రంగు దుస్తులు ధరించకూడదని, కాఫీలు, టీలు అధిక వేడిమి సమయంలో తాగడం మంచిది కాదన్నారు. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాలకు వెళ్ల కూడదని, ఎండ వేడిలో ఎక్కువసేపు పనిచేయకూడదని, మధ్య మధ్యలో చల్లని ప్రదేశంలో సేదతీరుతూ పనిచేయాలన్నారు. ఎండలో పార్క్ చేయబడిన కారులో చిన్న పిల్లలను, వృద్ధులను, ఆరోగ్యం బాగాలేని వారిని ఎక్కువ సేపు ఉంచకూడదన్నారు. తలపై రక్షణ లేకుండా ఎక్కువ సేపు ఎండలో ఉండకూడదని, వడదెబ్బ తగిలిన వారిని వేడి నీటిలో తడిపిన గుడ్డతో తుడువకూడదన్నారు. వడదెబ్బ తగిలిన వారిని సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లటలో ఆలస్యం చేయకూడదని సూచించారు. ఈ జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా చూసుకోవాలని ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతేనే తప్ప బయటకు రాకూడదని ప్రజలను కోరారు.

బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన జాన్సన్ నాయక్

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, సైనికుల్లా పని చేసి, బీఆర్ఎస్ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఎమ్మెల్యేలను గెలిపించి ఎన్ని నెలలు గడిచిన రుణమాఫీ చేయలేదని, రైతుబంధు ఇప్పటిదాకా వేయలేదని ప్రజలు పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రమేష్, వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ చారులత, పుష్పరాణి, ధరణి రాజేష్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాలేవాడ, కోపర్‌ఘడ్ గ్రామాలలో పార్లమెంట్ ఇన్‌చార్జ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌లతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ గురువారం విస్తృత ప్రచారంలో భాగంగా గ్రామస్తులతో కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యల పట్ల అవగాహన ఉందని గెలుపొందిన వెంటనే సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ అశోక్, జిల్లా కార్యదర్శి కొండారి రమేష్, మండల అధ్యక్షులు కోలిపాక రాజశేఖర్, నందిరెడ్డి స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సర్వరాజ్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలకుండీలు, టైర్లు, డబ్బాలు, మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతిరోజు చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఇంటి వద్ద ఉంచుకున్నట్టుయితే దోమలు దరికిరావని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, మర్సకొల లక్ష్మీబాయి, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్‌రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, ఈశ్వరి దేవి, వేణుతాయి, ల్యాబ్ టెక్నీషియన్ మడవి శ్రీనివాస్, తిరుమల, కిష్టన్న, ఆశకార్యకర్తలు పద్మ, కవిత గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని అగర్‌గూడ, కమ్మర్‌గాం, మురళీగూడ గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి కాంగ్రెస్ చేపట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొయిరె బండు, మాజీ సర్పంచ్లు సంజీవ్, సుధాకర్, మధునయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, కాంగ్రెస్ నాయకులు బాపూజీ, లచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

లెప్రసీ నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ-కౌటాల



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు నవత ఆధ్వర్యంలో లెప్రసీ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని గురువారం నిర్వహించారు. సుమారుగా 20 మంది స్త్రీలకు పరీక్షలు నిర్వహించగా అందులో ఐదుగురిని అనుమతులుగా గుర్తించినట్టు ఆమె తెలిపారు. ఈ వ్యాధి ఉన్న రోగులు సుమారుగా ఆరు నెలల పాటు మందులు వాడాలని వారికి సూచించారు. ఆరు నెలలకు సరిపడా మందులను సైతం అందించినట్టు ఆమె తెలిపారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ పరిశీలించి లెప్రసీ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించారు. ఆరు నెలల కోర్సును పూర్తిచేస్తేనే వ్యాధి నయమవుతుందని వారికి సూచించి అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా మరణాలు లేకుండా చూడాలి

- జిల్లా వైద్యాధికారి తుకారాం బట్
- ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మలేరియా వ్యాధితో ఎవరు మరణించకుండా చూడాలని, వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి తుకారాం బట్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జిల్లా మలేరియా అధికారి డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ గిరిజనులు నివాసం ఉంటున్న నేపథ్యంలో మలేరియా వ్యాధి పట్ల వారికి అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో నివారించేలా చూడాలన్నారు. అధిక మొత్తంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు ఉండకుండా గంబూసియా చేపలు వేస్తే దోమల నివారణకు దోహద పడతాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం నాలుగు లక్షల 35 వేల మంది మలేరియా వ్యాధి బారినపడి మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించినట్లు గుర్తు చేశారు. మలేరియా నివారణ కోసం 30 సంవత్సరాల కిందటే ప్రత్యేకంగా మందు కనిపెట్టినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి ఆవరణలో చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే నీటిలో ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేసేలా చూడాలన్నారు. దోమల నివారణ కోసం యాంటీ లార్వా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, వాటిని తొలగించాలన్నారు. పగిలిపోయిన పూల కుండీలు టైర్లు కొబ్బరి బోండాలు కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ కుమార్, అడ పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్ : ప్రపంచ మలేరియ దినోత్సవాన్ని పురస్కరించుకోని గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా దొమల నివారణకు చేపట్టాల్సిన అంశాలను తెలియజేస్తూ ముందుకు సాగారు. మలేరియా నిర్మూలనకు అందరు కృషి చేయాలని పీహెచ్‌సీ ఏఎన్ఎం కమల కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్ కుమార్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. గురువారం ఎంపీడీఓ బి.రమేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 16 మంది ఎంపీటీసీలు ఉండగా ఎవరు కూడా సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి విద్య, వైద్య, పశుసంవర్ధక, ఐసీడీఎస్, మిషన్ భగీరథ, విద్యుత్తు, వ్యవసాయశాఖల అధికారులు, ఇతర ఉద్యోగులు హాజరయ్యారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ జాజిమొగ్గ సుజాత శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీఓ అల్బర్ట్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు వచ్చినప్పటికీ ఎంపీటీసీలు రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్టు ప్రకటించారు. తదుపరి తేదిని ప్రకటిస్తామన్నారు.

ఎన్నికల పోలీస్ అబ్జర్వర్‌ను కలిసిన ఎస్పీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ రాజేష్ కుమార్ సక్సేనాను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ కేంద్రం వద్ద బందోబస్తు, భద్రత ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అబ్జర్వర్‌కు తెలపడంతో పాటు జిల్లాలో తీసుకుంటున్న భద్రత చర్యల గురించి వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లాలో ప్రతిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి తీసుకుంటున్న ముందస్తు చర్యలలో భాగంగా 6 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం, నగదు, ఇతర వస్తువులను సీజ్ చేయడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు బైండోవర్ చేస్తున్నామని అబ్జర్వర్‌కు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో జిల్లా స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాలతో నిరంతరం కూంబింగ్ ఆపరేషన్, గస్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి వచ్చిన సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేంద్ర విజయ్‌ను జిల్లా అధికారులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

రక్తదానం చేసిన యువకులు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామానికి చెందిన మడావి పార్వతికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరమని తెలుసుకున్న ఆసిఫాబాద్ మండలంలోని అబ్బుపెల్లి గ్రామానికి చెందిన చిన్నవేణి శ్రీకాంత్ ఆసిఫాబాద్‌లోని రక్తనిధి కేంద్రానికి వచ్చి 14వ సారి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకుడు శ్రీకాంత్‌కు ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఏసీబీ దాడులతో పీఠాలు కదలనున్నాయా..?

- రియల్ ఎస్టేట్ మాఫియాకు తలనొప్పులు
- రెవెన్యూ అధికారులు, మాఫియాకు బిగుసుకుంటున్న ఉచ్చు
- బాధితులతో సంప్రదింపుల ప్రయత్నం..?



ఇటీవల ఆర్డీఓ కార్యాలయంలో తనిఖీ చేసి బయటకు వస్తున్న ఏసీబీ అధికారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నాలుగు వరుసల రహదారిలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడులతో అధికారులతో పాటు జిల్లా కేంద్రంలోని పలువురు పీఠాలు కదిలేలా ఉన్నాయి. ఆర్డీఓ కార్యాలయంపై ఏసీబీ చేసిన దాడులకు పెద్దల పీఠాలు కదిలేలా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఆసిఫాబాద్ ఆర్డీఓగా పనిచేసిన దత్తు నాలుగు వరుసల రహదారిలో బాధితుల నుండి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అధికారులు ఇదే విషయంపై దాడులు చేయగా దీనితో పాటు ఆయనపై వచ్చిన కల్యాణ లక్ష్మి అక్రమాలు, ఇతర అవినీతి అంశాలు కూడా బయటికి వచ్చేలా ఉన్నాయి. దీనితో సంబంధం ఉన్న జిల్లా కేంద్రంలోని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఇతర అధికారుల బండారం కూడా బయటపడేలా ఉన్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

రియల్ ఎస్టేట్ మాఫియాకు తలనొప్పులు

2014లో తెలంగాణ ఆవిర్భావం నాటికి జిల్లా కేంద్రంలో పెద్దగా రియల్ ఎస్టేట్ లేదు. దీనికి తోడు జిల్లా కేంద్రంలోని ఎక్కువగా 1/70 చట్టానికి సంబంధించినది కావడంతో వేరే వ్యక్తులు కొనుగోలు అమ్మకాలు చేయలేదు. 2016లో జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రెవెన్యూ అధికారుల అండతో 1/70 చట్టాన్ని అతిక్రమిస్తూ అడ్డగోలుగా వెంచర్లు వేసి బాండ్ పేపర్ల మీద అమ్మకాలు చేశారు. ఇదంతా ప్రజలకు తెలిసినప్పటికీ అధికారులు అండదండలతో ఆ వ్యక్తి రెచ్చిపోయాడు. గతంలో అతని దగ్గర పని చేసే ఒక వ్యక్తి అప్రూవర్‌గా మారడంతో అది అప్పుడు పెద్ద సంచలనమే అయింది. కొద్ది రోజులకి సద్దుమణిగింది. మళ్లీ ఏసీబీ దాడులు కావడంతో రియల్ ఎస్టేట్ మాఫియాకు తలనొప్పిగా మారింది.

అధికారులకు మాఫియాకు బిగుసుకుంటున్న ఉచ్చు

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఇప్పుడు ఇదే నిజమైంది. నాలుగు సంవత్సరాల నుండి 1/70 చట్టాన్ని అతిక్రమిస్తూ రియల్ ఎస్టేట్ చేసి కోట్ల రూపాయలు గడించిన వారికి అండగా నిలిచిన అధికారులకు ఇప్పుడు ఏసీబీ, త్వరలో జరగబోయే విజిలెన్స్ అధికారుల దాడులు వారి మెడకు ఉచ్చు బిగిసెల ఉన్నాయి. అక్రమార్కులపై ఎన్నో సందర్భాల్లో ప్రజల్లో చర్చ జరిగినప్పటికీ అధికారుల అండదండలతో వారి ఆటలు కొనసాగాయి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా తయారైంది.

బాధితులతో సంప్రదింపులకు ప్రయత్నం..?

గతంలో నాలుగు వరుసల రహదారితో పాటు కళ్యాణ లక్ష్మి, జిల్లా కేంద్రంలో అక్రమ వెంచర్లలో అవినీతి జరుగుతున్నాయని పత్రికల్లో కథనాలతో పాటు ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆరోపించారు. దానిలో బాధితులైన వారు ఏసీబీకి ఫిర్యాదు చేయగా వారి దాడుల నుండి తప్పించుకోవడానికి బాధితులతో అక్రమార్కులు సంప్రదింపుల ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. వారు నష్టపోయిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని ఏసీబీ అధికారులకు ఏ విషయాలు చెప్పద్దని వేడుకోవడంతో పాటు బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అక్రమార్కులు బయటపడితే జిల్లా కేంద్రంలోని అనేక మందికి న్యాయం జరుగుతుంది.

పారదర్శకంగా విచారణ జరిపాలి

దుర్గం దినకర్, సీపీఐ(ఎం) జిల్లా నాయకుడు



జిల్లా ఆవిర్భావం తర్వాత ఒకరిద్దరు వ్యక్తులు అధికారులతో చేతులు కలిపి నాలుగు వరుసల రహదారిలో భూములు కోల్పోయిన వారిలో అక్రమాలు, అక్రమ వెంచర్లు వేశారు. ఏసీబీ అధికారులు చేసిన దాడులతో వీటన్నింటిపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు సరైన న్యాయం చేయాలి. లేని పక్షంలో బాధితులకు అండగా ఉండి పోరాటం చేస్తాం.

వంద శాతం పోలింగ్‌కు కృషి చేయాలి

- పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్రవిజయ్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వచ్చే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో జిల్లాలోని సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో వంద శాతం పోలింగ్ నమోదుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ అన్నారు. గురువారం ఆయన సిర్పూరు నియోజకవర్గం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్, మండలంలోని భట్టుపెల్లి ఎంపీపీఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఆర్డీఓ సురేష్, తహసీల్దార్ కిరణ్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర విజయ్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీఎంసీ, కంట్రోల్ రూం, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, ఎన్నికల సంబంధిత విభాగాల అధికారులతో పాటు అదనపు సిబ్బందిని నియమించడం జరిగిందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు. అత్యవసర సేవలు అందిస్తున్న వారితో పాటు ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 85 ఏండ్లు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ ద్వారా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రకటనలు, ఆడియో, వీడియో ప్రదర్శనల కోసం సువిధ ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటల పాటు బందోబస్తు ఉండాలని, ఎప్పటికపుడు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని అన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష జరుపుతున్న పరిశీలకులు, కలెక్టర్

జిల్లాలో 676 పోలింగ్ కేంద్రాలు : జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే

జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిర్పూరు నియోజకవర్గంలో 320, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 55 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక, 61 షాడో, 24 ఎల్‌డబ్ల్యూఈ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 828 మంది ప్రిసైడింగ్, 849 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్, 1989 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. 91 రూట్లలో సెక్టార్ అధికారుల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కెరమెరి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో, సిర్పూరు నియోజకవర్గంలో కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘీక సంక్షేమ పాఠశాల, జూనియర్ బాలికల కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ అభివృద్ధి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత పది సంవత్సరాలలో బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంటుందని ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇతర నాయకులతో కలిసి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల్లో ఎవరు ఏ బాధ్యతలు చేపట్టాలో ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల సమయం ఆసన్నమైనందున ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అవతల వాళ్ళకి క్యాడర్ లేదు లీడర్ లేదని ఆరోపించారు. కేవలం సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక ప్రచారం మినహా వారు చేసేదేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆత్రం సక్కు గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి గెలుపులో కుమురం భీం జిల్లా కీలకం కానుందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల ఆరోపణలు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే తమ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరస్వతి, అలీబిన్ అహ్మద్, అన్ని మండలాలు నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు నుండి పడి బీహార్ వాసి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్-వేంపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి బీహార్ రాష్ట్రం బరుహర్వ గ్రామానికి చెందిన అజయ్‌కుమార్(24) మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. బెంగుళూరులో కూలీ పని చేసుకొని జీవించే అజయ్‌కుమార్ తన స్వగ్రామానికి వెళ్లేందుకు గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి లోయలో పడి మృతి చెందినట్లు వివరించారు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులను గుర్తించి సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి ఉన్న పరిస్థితిలో గురువారం లభ్యమైందని, ఈ మృతదేహాన్ని సిర్పూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

ఏబీసీడీ వర్గీకరణ చేసే వారికే మద్దతు

నవతెలంగాణ-బెజ్జూర్

ఎస్సీ వర్గీకరణకు సహకరించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండ్ర బ్రహ్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అంగీకారించడంతో బీజేపీకి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆ పార్టీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పిట్టల సత్యనారాయణ, పెగడపల్లి తిరుపతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డూరి శ్రీనివాస్, గద్దల ప్రవీణ్, పెగడపల్లి అనిల్, కుమ్మరి శంకర్, గోలేటి పోషణ, నక్క శ్రీను, పురుషోత్తం పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో లోటుపాట్లు రాకుండా చూడాలి

- పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు రాజేంద్ర విజయ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎన్నికలపై ఎటువంటి ఫిర్యాదులనైన 8523876384 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. లేదంటే ఆదిలాబాద్‌లోని పెన్ గంగ అతిథి గృహంలో మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు ప్రతిరోజు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, నేరుగా తనను కలవవచ్చన్నారు. పారదర్శక ఎన్నికల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే వివరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామాగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ సందర్శించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. స్వీప్ యాక్టివిటీ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



మౌనిక



పి.శిరీష



డి.రోజా



లలిత

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ ఇంటర్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో కేజీబీవీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో విద్యార్థులను కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాగసుధ అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సు ఎంపీహెచ్‌డబ్ల్యూలో వంద శాతం, ప్రథమ సంవత్సరంలో 83 శాతం, ద్వితీయ సంవత్సరం సీఈసీ వంద శాతం, ప్రథమ సంవత్సరం 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ వి.మౌనిక 913, మొదటి సంవత్సరంలో డి.రోజా 465, ద్వితీయ సంవత్సరం సీఈసీ పి శిరీష 893, ప్రథమ సంవత్సరంలో లలిత 430 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాగసుధ, అధ్యాపకురాళ్లు అభినందించారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో చదివి ప్రతిభ కనబరచడం విద్య సంపన్నులకే కాకుండా సామాన్యులు కూడా తక్కువేమీ కాదని నిరూపించారని, ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం విద్యా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తుందని, విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో జిల్లా విద్యార్థిని ప్రతిభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ బుధవారం ప్రకటించిన ఫలితాలలో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని శ్రీకృతి మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 470కి గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటింది. జైనూర్ ప్రభుత్వ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న సునీల్, స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న నీతు దంపతుల కూతురు శ్రీకృతి 8వ తరగతి వరకు స్థానిక సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో చదివింది. అనంతరం 9, 10 తరగతులు హైదరాబాద్ శ్రీ చైతన్యలో చదవగా, ఇంటర్మీడియట్ ప్రస్తుతం నారాయణ మాదాపూర్ బ్రాంచ్‌లో చదువుతుంది. తల్లిదండ్రులు ఇద్దరు విద్యా విభాగానికి చెందిన వారు కావడంతో విద్యార్థినికి సరైన సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు విద్యార్థినిని అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని జైత్‌పూర్ బోర్డ గ్రామ శివారులో పేకాట స్థావరాలపై గురువారం ఎస్సై సాగర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. బోర్డ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 3530 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు. పేకాట, మట్కా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శుక్రవారం | ఏప్రిల్ 26, 2024 | www.navatelangana.com

షార్ట్‌సర్క్యూట్‌తో చెప్పల షాప్ దగ్ధం

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 9 ఎక్స్ ఫుట్ వేర్ దుకాణంలో గురువారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగింది. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఉన్న చెప్పుల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు షాప్ యజమాని తెలిపారు.

మరో విద్యార్థి బలవన్మరణం

నవతెలంగాణ-నస్పూర్



ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మరో విద్యార్థి బలవన్మరణం చెందిన దుర్ఘటన మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన నూన్సావత్ అరవింద్(17) ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం వెలువడిన ఫలితాల్లో గణితంలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లోని ఇనుప రాడుకు చున్నీతో ఉరి వేసుకున్నాడు ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసే సరికి ఉరి వేసుకొని కనిపించడంతో భయందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

మలేరియా నివారణలో భాగస్వాములు కావాలి

• మండల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ



నవతెలంగాణ-జన్నారం

మలేరియా నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జన్నారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఆస్పత్రి ఆవరణలో వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాశ్రీ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు ప్రబలి మలేరియా, డెంగీ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి చుట్టూ మురుగునీటి కుంటలు, మురుగునీటి కాలువలు ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే మండలంలోని తపాలాపూర్ గ్రామపంచాయతీలో ప్రజలకు మలేరియా నివారణపై హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఎమ్మెల్ హెచ్‌పీ సందీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దోమలు పుట్టకుండా నివారించే పద్ధతులు, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, డ్రై డే ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో, హెల్త్ సూపర్‌వైజర్‌లు సుశీల రాంబాబు, హెల్త్ అసిస్టెంట్ ఎండి రషీద్ ఖాన్ పాల్గొన్నారు.

మే డే పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-మందమర్రి

138వ మేడేకి సంబంధించిన పోస్టర్లను ఏఐటీయూసీ నాయకులు గురువారం కేకే-5గని వద్ద విడుదల చేశారు. సింగరేణి ప్రాంతంలో మే డేను ఘనంగా నిర్వహించుకోవాలని ఏరియా బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరి కంది శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, అసిస్టెంట్ సెక్రటరీ ప్రేమ్ లాల్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లకు ఓటర్ల స్లిప్పులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తహశీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అధికారులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ప్రజలకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డీటీ రామ్మోహర్‌రావు ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్



స్థానిక నస్పూర్‌లోని సాధన ఎక్సలెన్సియా పాఠశాలలో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్‌ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పెంచాల శ్రీధర్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ జిల్లా నలుమూలల అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో హ్యాండ్ బాల్ క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తితో ఆడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఇండియన్ టీం హ్యాండ్ బాల్ కోచ్, టోర్నమెంట్ కన్వీనర్ బొడ్డు విష్ణువర్ధన్, జిల్లా సెక్రటరీ తుండ్ల శ్రీనివాస్, గుడెం సత్యనారాయణ స్వామి దేవాలయం డైరెక్టర్ భూపతి మధుకర్, ప్రముఖ అడ్వకేట్ దామోదర్‌లాల్ బంగ్, వసుధ హాస్పిటల్ డైరెక్టర్ రామన్న, సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అడ్వైజర్ పెంచాల వేణు, అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి మారయ్య, సాధన గ్రీన్ కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ పెంచాల సంధ్య, సాధన ఎక్సెలెన్సియా పాఠశాల ప్రిన్సిపాల్ రాంపురం నరేష్ పాల్గొన్నారు

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కలిసి కట్టుగా ఉండి, కాంగ్రెస్ రోడ్ షో, మీటింగ్‌ను విజయవంతం చేయాలని అందరూ కలిసి సమిష్టిగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని నాయకులు తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఏ విదంగా కష్ట పడ్డారో, ఇప్పుడు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ భారీ మెజారిటీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

ఇండియా కూటమిని బలపరచండి

• సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

మతోన్మాద విధానాలు అవలంబిస్తున్న బీజేపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమిని బలపరచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని చార్వక హాల్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్ల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పది ఏండ్ల కాలంలో దేశంలోని రైతులు, ప్రజలు, కార్మికులు, చేతివృత్తిదారుల వ్యతిరేక విధానాలను అవలంబించిందని, పెట్టుబడుదారుల ఆస్తులు పెరగడం కోసం దాని విధానాలను మార్చుకుందన్నారు. ఒకవైపు దేశంలోని పేదరికాన్ని నిర్మూలించకుండా, నిరుద్యోగాన్ని నివారించకుండా, ఆకలి చావులను అరికట్టకుండా, రైతులకు కనీస మద్దతు ధర కల్పించకుండా, కార్మిక చట్టాల్ని రక్షించకుండా, మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారలను, హింసలను, అరికట్టకుండా, దేశంలోనే ఓబీసీలలో కులగణన చేయకుండా, బడ్జెట్ కేటాయించకుండా బీజేపీ పాలన సాగిందన్నారు. తిరిగి మళ్ళీ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ఈరోజు దేశంలోని ప్రధాన సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రజల్లోని సున్నితమైన అంశాలను తీసుకొని భావోద్వేగాలని రెచ్చగొట్టి మతోన్మాదం పేరు మీద కార్మిక పోరాటాలను, ప్రజా పోరాటాలను, రైతు పోరాటాలను అణిచివేస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థకి, రాజ్యాంగానికి, ఫెడరలిజానికి, దేశ భవిష్యత్తుకు బీజేపీ విధానాల ద్వారా ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగా సంస్థలను అమ్మేసిందని మళ్లీ బీజేపీ గెలిస్తే ఈ దేశాన్ని తాకట్టు పెడుతుందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్ మాట్లాడుతూ దేశంలోని ప్రజా, కార్మిక, రైతాంగ సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేయడానికి బీజేపీ విధానాలు కొనసాగిస్తోందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి, దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాగం రాజారాం, దూలం శ్రీనివాస్, గోమాస అశోక్, రాజలింగు, దుంపల రంజిత్ కుమార్, లింగన్న, లక్ష్మణ్, ఉమారాణి, దేవదాస్ పాల్గొన్నారు.

లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

జన్నారం : దేశాన్ని గత పది సంవత్సరాలుగా దేశాన్ని ఏలుతున్న ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పేదలపైన భారం మోపుతూ పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచి పెడుతుందని అలాంటి, పార్టీని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గడిచిన 10 ఏండ్లలో ఒక్కటి కూడ అమలు పర్చలేదన్నారు. మనషుల మధ్య మత, కుల ఘర్షణలు పెట్టి విడగొట్టి రాజకీయ లబ్ధి పొందుతుందన్నారు. ప్రస్తుతం మళ్లీ అధికారంలోకి రావడం కోసం లేని ఘర్షణలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. మండలంలో భూముల సాగుదారులపై అటవీ అధికారులతో దాడులు, దౌర్జన్యాలు చేయిస్తుందన్నారు. చేతివృత్తుల పై ఆధారపడ్డ మేదరులకు వెదురు తెచ్చుకునే అవకాశం లేకుండా చేసిందన్నారు. బీజేపీని ఓడించడం ద్వారానే జన్నారం ప్రజలకు విముక్తి దొరుకుతుందని అందుకే ఆ పార్టీని ఓడించాలని పిలుపునిస్తున్నామన్నారు. సీపీఐ(ఎం) మద్దతునిస్తున్న ఇండియా కూటమి లోని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, కనికారం అశోక్, మండల నాయకులు కొండగుర్ల లింగన్న, కూకటికారి బుచన్న, మగ్గిడి జయ, గుడ్ల రాజన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

సామాజిక మాధ్యమాల్లో చట్టవ్యతిరేక పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్(ఎస్ఎంటీసీ)ని పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ పోలీస్ అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికగా కొందరు వివిధ రాజకీయ నేతలను టార్గెట్‌గా చేసుకుని కొందరు, ఓ మతాన్ని లేదా మతానికి సంబంధించిన ప్రముఖుల్ని టార్గెట్‌గా చేసుకుని మరికొందరు పోస్టులు పెడుతున్నారని అన్నారు. ఓ వర్గాన్ని కించపరుస్తూ పోస్ట్ చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో పుకార్లు ప్రచారం చేసినా జైలుకు వెళ్లాల్సి ఉంటుందంటున్నారు. అలాంటి వారికి జైలు శిక్ష, జరిమానాతోపాటు కేసు తీవ్రతను బట్టి జీవిత ఖైదు పడే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేముందు, వచ్చిన పోస్టులను ఫార్వర్డ్ చేసేముందు అవి నిజమా కాదా అని ఒకసారి ఆలోచించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. 24 గంటలు నిరంతరం సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో మతాలను, కులాలను, ఒకరినొకరు కించపరుస్తూ గాని, లేనిపోని అబద్ధపు పుకార్లను సృష్టించి ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా ఉంటుందన్నారు. కొందరు ఐపీ అడ్రస్‌లు మార్చి, మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారిని వదలిపెట్టమని, సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకరమైన, చట్టవిరుద్ధమైన పోస్టులు పెట్టేవారిపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 ప్రకారం చర్యలు తప్పవని సిపి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ఇన్స్‌పెక్టర్ ముత్తి లింగయ్య, ఎస్ఐ రాజమణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

• అదనపు కలెక్టర్ బి.రాహుల్

నవతెలంగాణ-మంచిర్యాల



విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారి లక్ష్యాలను చేరుకునేలా చేయాలన్ని అదనపు కలెక్టర్ బి రాహుల్ తెలిపారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని నారాయణ హైస్కూల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి దానికి అనుగునంగా వారికి సలహాలు సూచనలు చేస్తు ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అంతే కాకుండా చదువుకునే వయస్సులోనే పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని వారు ఎటువంటి చెడు అలవాట్లకు గురికాకుండ చూడడం తప్పని సరని తెలిపారు. ఏజీఎం ఆనం చైతన్యరావు, స్కూల్ ప్రిన్సిపల్ మామిడిశెట్టి కవితలు మాట్లాడుతూ గొప్ప పేరు ప్రఖ్యాతలు, 45 యేండ్ల చరిత్ర కల్గిన పాఠశాలలో చదవడం గర్వంగా భావించాలని, విద్యారంగంలో నూతన విధానంతో సంచలన ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ అమల స్కూల్ ప్రగతి నివేదికను అందించారు. అనంతరం చిన్నారులకు మెడల్స్ అందించి అభినంధించారు. చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ శ్రావణి, హైస్కూల్ డీన్ వెంకటస్వామి, ఏట సంతోష్ కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

అద్దె ఇబ్బందులు రాకుండా జగ్రత్త పడాలి

• సీఈఓ గణపతి



నవతెలంగాణ-జైపూర్

3 నెలల వ్యవధిలో మండల పరిషత్ కార్యాలయం ఐకేపీ భవనంలోకి మార్చాలని, లేదంటే అద్దె చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతాయని జడ్పీ సీఈఓ గణపతి సూచించారు. గురువారం జైపూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని సంధర్శించిన ఆయన మండల పరిషత్ కార్యాలయం విషయమై ఎంపీడీఓ సత్యనారాయణ, సూపరిటెండెంట్ కుమారస్వామిని భవిష్యత్ కార్యాచరణ ఏమిటని అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఐకేపీ భవనంలో మండల పరిషత్ నిర్వాహణకు అన్ని ఏర్పాటు చేసుకుంటామని వారు వివరించారు. కాగా మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న పనుల నిర్వాహణ తీరును అడిగితెల్సుకున్నారు. అందుబాటులో ఉన్న సిబ్బంది శాఖ వారిగా కార్యాలయ నిర్వాహణపై విచారించారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార గ్రామ పంచాయతీల వారిగా నిర్వహిస్తున్న పనులను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరు శాతం తదితర విషయాలపై సమీక్షించారు. మొదటి సారి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సీఈఓ గణపతిని శాలువాలతో సన్మానించారు.

5వ వార్డులో కాంగ్రెస్ ఇంటింట ప్రచారం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఐదో వార్డులో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆ వార్డు అధ్యక్షుడు నవాబ్ ఖాన్, గుత్తికొండ శ్రీధర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి పెద్దపల్లి నియోజకవర్గ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. అంతేకాకుండా వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని మన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు దృష్టికి తీసుకువెళ్లడానికి వాళ్ల చెప్పిన సమస్యలను రాసుకొని వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లే దిశగ కార్యక్రమం చేపట్టడం జరిగింది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మినుముల శాంతి కుమార్, గరిసె రవి, అయూబ్, అజ్జు పాల్గొన్నారు.

వేమనపల్లి : పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓయూ జేఏసి కోఆర్డినేటర్ దుర్గం మల్లేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వేమనపల్లి మండలంలోని బుయ్యారం గ్రామంలో గురువారం కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మల్లేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయండి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మే 4వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంచిర్యాల రోడ్ షో విజయవంతం చేయుటకై నాయకులు, కార్యకర్తలకు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. గురువారం క్యాతనపల్లిలోని బాల్క సుమన్ స్వగృహంలో మందమర్రి మున్సిపాలిటీ, జైపూర్ మండలం, క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలను, రానున్న లోక్ సభ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ భారీ మెజారితో గెలిపించేలా నాయకులు అంతా సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎంపీగా ఆత్రం సుగుణ గెలుపు ఖాయం

నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు ఖాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆత్రం సుగుణకు చెందిన ప్రచార రథన్ని టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో గెలిచిన తీరుగానే కేంద్రంలో కూడా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు ప్రతి గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేస్తూ ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సయ్యద్ ఇసాక్ మచ్చ శంకరయ్య, బాదావత్ సుధాకర్ నాయక్, మాజీ జడ్పీటీసీ టేకుమట్ల పంకజ, దాముక కరుణాకర్, దుర్గం లక్ష్మీనారాయణ, కంప సుధీర్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్, అజర్ రాహుల్ యాదవ్, షాకిర్ అలీ, కానుగంటి రాజన్న పాల్గొన్నారు.

ప్రయాణికులకు షెడ్డు నిర్మించడం హర్షణీయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని ఉత్కూర్ అంబేద్కర్ చౌరస్తాలో ప్రయాణికులకు తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేయడం హర్షనీయమని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగిరి రాజు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డును ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రయాణికులకు షెడ్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చిన 24 గంటల్లో స్పందించిన మున్సిపల్, ఆర్టీసీ, పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, గరిసే రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 27వ తేదీన విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు కబడ్డీ జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రపాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ 15 రోజుల పాటు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పీఈటీ సదానందంను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఏదైనా సమాచారం కోసం 9849124856 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మండలంలో కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంటు తదితర పథకాలపై ఉపాధిహామీ సిబ్బందికి వివరించారు. వచ్చే జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్ట అధ్యక్షుడు మండోకార్ అనిల్, నాయకులు రమేష్, ప్రకాష్, కార్యకర్తలున్నారు.

వేసవి సెలవులు వృథా కానివ్వకండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోనేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని సరస్వతి శిశుమందిర్ ప్రిన్సిపల్ కోటేశ్వర్ తెలిపారు. పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున బయట తిరగకుండా చూడాలని, అదే సందర్భంలో కంప్యూటర్ తరగతులు ఇతర చదువుకు సంబంధించిన అంశాలు నేర్పేలా చూడాలన్నారు. ఎక్కువగా పిల్లలు ఫోన్‌లను చూస్తున్నారని, అలా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణుగోపాల్, మధుకర్, విశాల్ పాల్గొన్నారు.

రైతులను మోసగించే డీలర్లపై చర్యలు తప్పవు

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైతులను మోసగించే డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు విక్రయించే అక్రమార్కులపై చర్యలు తప్పవన్నారు. డీలర్లు ఎరువులు, విత్తనాలు విక్రయించే ముందు రైతులకు అన్ని వివరాలతో కూడిన బిల్లులు అందించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, గోడౌన్‌లలో నిల్వ ఉంచినా చర్యలు తప్పవని, షాపుల ముందు స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి సరుకుల వివరాలు, ధరలను నమోదు చేయాలని, స్టాక్ రిజిస్టర్‌లు, లైసెన్సులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. డీలర్లందరూ ఎప్పటికప్పుడు రోజువారి నివేదికను వ్యవసాయ అధికారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామక్రిష్ణ ఉన్నారు.

27న ప్రపంచ పశువైద్య దినోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని గుంటూరు కాలనీ సమీపంలో గల పశువైద్య శాలలో ఈ నెల 27న ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి విజయ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో కుక్కల దాడుల్లో చాలామందికి ప్రమాదాలు జరుగుతుండంతో రేబిస్ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా కుక్కలకు టీకాలు వేయించుకోవాలని డాక్టర్ విజయ్ కోరారు. ఈ పశువైద్య శిబిరం ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షులుగా రవీందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా గుండి మాజీ ఎంపీటీసీ జాబరి రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కులు ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రతీ నాయకుడు, కార్యకర్తతో సన్నిహితంగా వ్యవహరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఆసిఫాబాద్ మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన గాధవేని మల్లేష్ రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని పాపంపేట గ్రామానికి చెందిన సాపిల ఈశ్వరి పిచ్చి కుక్కల దాడిలో గాయపడ్డారు. గురువారం ఉదయం తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి ఈశ్వరిని గాయపరిచింది. అదే గ్రామానికి చెందిన దుర్గం శంకర్‌కు చెందిన రెండు మేకలను తీవ్రంగా గాయపరిచిన పిచ్చికుక్క మరికొందరి పై దాడి చేసింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు కాగా తాజాగా పాపన్నపేటలో పిచ్చికుక్క దాడిలో ఈశ్వరికి గాయాలు కావడంతో పాటు రెండు మేకలపై దాడి చేసింది. పిచ్చి కుక్కల బెడద నుండి కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు

వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వచ్చే నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలలో వయోవృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హైదరాబాద్‌లో ఎన్నికల సంఘాన్ని కలిసి చేసిన వినతి మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయని, ఈ మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో తగు ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా నంబాల గ్రామానికి విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలనికోరారు.

మంచినీరు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వ్యాపారస్తులు తమ దుకాణాల ముందు వేసవి నేపథ్యంలో మంచినీరు ఏర్పాటు చేయాలని కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా ప్రమోద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి సరుకుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుండి కొనుగోలుదారులు వస్తారని వారి సౌకర్యార్థం తాగునీరు ఏర్పాటు చేసి వారికి ఉపయోగపడేలా చూడాలని కోరారు.

బీజేపీని ఓడిస్తేనే దేశ పరిరక్షణ

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రానున్న లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఓడిస్తేనే దేశాన్ని పరిరక్షించుకోగలుగుతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు అన్నారు. 'పార్లమెంట్ ఎన్నికలు-పార్టీ వైఖరి' అనే అంశంపై గురువారం కాగజ్‌నగర్‌లోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాములు మాట్లాడుతూ ఈ ఎన్నికల ద్వారా బీజేపీ దుర్మార్గపు భావజాలాన్ని ప్రజల నుండి దూరం చేసేందుకు ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే త్రిశూల తంత్రాన్ని పాటిస్తూ భారత రక్షణ, విద్యా, పరిపాలనారంగాలపై దాడి చేస్తోందన్నారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తూ బెదిరింపులకు గురి చేస్తోందని అన్నారు. రాజ్యాంగ మూలసూత్రాలైన ఫెడరల్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. సామాజిక న్యాయం కాపాడాల్సిన ప్రభుత్వమే దళితులు, గిరిజనులపై దాడుల కారకులకు మద్దతునిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శతకోటీశ్వరుల సంఖ్య పెరిగిందనీ, నిరుద్యోగ సమస్య మాత్రం తీరలేదన్నారు. హక్కుల కోసం మాట్లాడిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి జైలులో పెడుతున్నారని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.8వేల కోట్ల అవినీతికి బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే రానున్న ఎన్నికలలో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు

సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న స్థానాలలో ఆ పార్టీ అభ్యర్థులు, ఇతర స్థానాలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆదిలాబాద్ స్థానంలో ఇండియా కూటమి నుండి పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, ముంజం శ్రీనివాస్, గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీని నిలిపివేయాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని యాజమాన్యం ఇటీవలే కొంతమంది కార్మికుల వద్ద నుంచి అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేసిందని, మరికొంతమందికి రికవరీ చేయుటకు నోటీసులు జారీ చేసిందని వెంటనే రికవరీ నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా మాట్లాడుతూ ఇటీవలే సింగరేణి యాజమాన్యం ఎస్ఆర్పీ-3 గనిలో పనిచేస్తున్న 147 మంది కార్మికుల వద్ద మార్చి నెల వేతనాల నుంచి అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేసిందని, ఏప్రిల్ నెల జీతాల నుంచి 81 మంది ఆర్కె-5 కార్మికుల నుంచి 115 మంది, ఆర్కే న్యూటెక్ కార్మికుల నుండి రికవరీ చేస్తామని నోటీసులు జారీ చేశారన్నారు. 2008లో గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్నటువంటి కార్మికులు ఏదైనా పని నిమిత్తం యాజమాన్యం సర్ఫేస్‌లో కార్మికులకు పని కేటాయిస్తే వారి జీతాల నుంచి అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ చేయకూడదని యాజమాన్యంతో ఒప్పందం చేసుకోవడం జరిగిందని కాని యాజమాన్యం ఆ సర్క్యులర్ను తుంగలో తొక్కి కార్మికుల జీతాల నుంచి అండర్ గ్రౌండ్ అలవెన్స్ పేరిట రికవరీ చేస్తుందని తెలిపారు. ఎస్ఆర్పి త్రీ గనిలో రికవరీ చేసిన కార్మికుల డబ్బులను తిరిగి చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయం ఫిట్ కార్యదర్శి గొల్లపల్లి రామచందర్, అఫ్రోజ్ ఖాన్, సందీప్ పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 69 ఉండగా అందులో 60 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక కావడంతో గురువారం కుభీర్ పాఠశాల మరియు జూమ్డ, రాజురా పాఠశాలలను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్ పరిశీలించారు. ఈసందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికైన పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించడంతో వాటిని పరిశీలించారు. దింతో పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ సదుపాయం, డ్రింకింగ్ వాటర్, మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టేలా చూడలన్నారు, ఈపనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా చూడలన్నారు. పనులను నాణ్యతతో చేసేలా చూడాలన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించి. మొక్కలకు నీళ్ల పట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ గోవర్ధన్, ఐకేపీ ఏపీఎం రమేష్ ఉపాధి హామీ ఏపీఓ హరిలాల్ పంచాయతీ కార్యదర్శిలు, అధికారులు ఉన్నారు.

విద్యా సంవత్సరానికి ముందే పనులు పూర్తి చేయాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు విద్యా సంవత్సరానికి ముందే పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. ఇందారం, పౌనూర్ గ్రామ పంచాయతీలను సంధర్శించిన ఆయన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. విద్యార్థుల అవసరాల మేరకు వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. స్థానికంగా ఉన్నటువంటి ఆర్వో ప్లాంట్ ద్వార నీటి సరఫరా తీరు సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చెడిపోయిన ఫ్లోరింగ్ సరి చేయించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సంధర్శించిన ఆయన నాణ్యమైన కోడి గుడ్లను పంపిణీ చేయాలని కోరిన ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో గల నిల్వలను పరిశీలించారు. అదేవిధంగా ఇందారం నీటి సరఫరా కొనసాగుతున్న తీరు పరిశీలించిన ఆయన మండల పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించారు. గ్రామ పంచాయతీ శివారులో ఉపాధి హామీ పథకం ద్వార నిర్వహిస్తున్న మైనర్ ఇరిగేషన్ కుంటల్లో పూడిక పనులను పరిశీలించారు. నిర్ణీత కొలతలతో పనుల నిర్వాహణ కొనసాగాలని సూచించారు. ఎండకు ముందే పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు.



కార్మికులకు అండగా ఉంటాం : టీబీజీకేఎస్



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల కోసం ఉద్యమిస్తామనిబెల్లంపల్లి ఏరియా టీబీజీకేయస్ నాయకులు అన్నారు. గురువారం గోదావరిఖనిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో బెల్లంపల్లి ఏరియాలోని టీబీజీకేయస్ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. సమావేశంలో టీబీజీకేయస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిని ప్రధాన కార్యదర్శిగా కొత్తగూడెంకు చెందిన కాపు కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణి గెలిచిన సంఘాలు ఇచ్చిన హామీలు అమలు కోసం పోరాటం చేస్తామని, సింగరేణి కార్మికులకు అండగా ఉంటామని, సింగరేణి కార్మికులతో పాలు పంచుకుంటామని, ప్రతి కార్యకర్త ప్రతి సింగరేణి కార్మికుడికి అండగా ఉంటామని టీబీజీకేయస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో ఇంకమ్‌ట్యాక్స్ మినహాయింపు, సొంతింటి పథకం లాంటి 13 తీర్మానాలు ఈ సమావేశంలో ఆమోదించారు. ఇందులో బెల్లంపల్లి ఏరియా టీబీజీకేయస్ నాయకులు దరావత్ మంగీలాల్, గజ్జెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేష్, మాంకు సమ్మయ్య, అలవేని సంపత్, నైతం వీరస్వామి, మహేందర్, ఫిట్ కార్యదర్శులు కార్నాదం వెంకటేష్, రాజేశం, మెరుగు రమేష్, అనుముల సత్యనారాయణ, మంకయ్య, నాయకులు దేవేందర్, ఓరం కిరణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మూడు రోజుల ఉచిత వేసవి సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ నందు ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉచిత వేసవి సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని నిర్వాకుడు కోటేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంప్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులకు రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, కోడింగ్ ప్రోగ్రామింగ్ నేర్పించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన 6వ, 7వ, 8వ తరగతి బాలబాలికలు పాల్గొనవచ్చని, ఇతర వివరాలకు 9014206234, 9700264441 నెంబర్‌కి ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఇలాంటి వేసవి శిక్షణాలను వినియోగించుకోవాలని సూచించారు.

నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మాట్లాడుతూ రైతుల నుండి ప్రతి గింజను కొనుగోలు చేయడమే లక్ష్యంగా 37 నిర్దేశిత వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 కనీస మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. దళారీ వ్యవస్థను నమ్మి మోసపోకుండా రైతులు తమ ఉత్పత్తులను సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. విక్రయించే ఉత్పత్తులకు తప్పనిసరిగా రసీదు పొందాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. రైతులు తాము కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కరిమల కళాశాల విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-జన్నారం

బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థిని విలాసారం శ్రీవల్లి బైపీసీ సెకండ్ ఇయర్ విభాగంలో 982/1000 మార్కులు సాధించి స్టేట్ ఎనిమిదవ ర్యాంకు సాధించినది. ఫస్ట్ ఇయర్ బైపిసి విభాగంలో నేహా తమన్నా 426 /440 మార్కులతో జిల్లా ర్యాంకు సాధించినది. ఎంపీసీ సెకండ్ ఇయర్ విభాగంలో తమన్నా నాచ్ 930/1000, ఎంపీసీ ఫస్ట్ ఇయర్ విభాగంలో కడార్ల ప్రమోద్ 415/470 మంచి మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, అకాడమిక్ డైరెక్టర్ ఐఐటీ, జెఈఈ ప్రొఫెషనల్ ఎక్సపర్ట్ బీఏ వరప్రసాద్ కళాశాల ప్రిన్సిపల్ ఎదులాపురం లక్ష్మణ్ అధ్యాపక బృందం అభినందించారు. డీన్ కొలివాడ అన్నపూర్ణ కళాశాల బృందం ఆ విద్యార్థులను అభినందించారు.

కూచిపూడి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కళల పట్ల అభిరుచి ఉన్న వేదికలు లేక జీవితంలో లోటును పూర్తిచేయలేక పోతున్నారని అలాంటి వారు కూచిపూడి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం గోపాలకృష్ణ మఠంలో అవంతి కూచిపూడి వేసవి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఆదిదేవుడు గణపతికి మఠాధిపతి యోగనంద సరస్వతితో కలిసి పూజలు చేశారు. అనంతరం నృత్య గురువు అవంతితో మాట్లాడి శిక్షణ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా మందికి కళల పట్ల అభిరుచి ఉన్న వాటిని పూర్తి చేయలేక పోతున్నారన్నారు. కూచిపూడి అభిరుచి ఉన్న వారి కోసం అవంతి వేసవి శిక్షణ శిబిరం వేదిక అవుతుందన్నారు. నృత్య కళలను ప్రోత్సహించేల తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంద్రత్ సంతోష్, బండారి దేవన్న, మనోజ్ పవర్ ఉన్నారు.

రూ.1.12లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల కోడ్‌లో భాగంగా మంచిర్యాల పట్టణంలో పరిమితికి మించి నగదు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి మొత్తం రూ.1.12లక్షల నగదును పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించే క్రమంలో ఎటువంటి ధృవపత్రాలు లేకుండా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ తనిఖీల్లో నరేష్ వద్ద రూ.61వేలు, ఆదిత్యా నుంచి రూ. 51వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సీజ్ చేసిన నగదును ఎన్నికల అధికారులకు అప్పగించారు.

